క్లుప్తంగా

నేడు సహకార సంఘం కాంప్లెక్స్ ప్రారంభోత్సవం


సి.బెళగల్ సహకార సంఘం కాంప్లెక్స్

సి.బెళగల్: సి.బెళగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన షాపింగ్ కాంప్లెక్స్ సోమవారం ప్రారంభించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ గోపాల్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, కుడా చైర్మన్, నియోజవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం ముఖ్య అతిథులుగా హాజరు అవుతారని వారు వెల్లడించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మల్టీ సర్వీస్ సెంటర్‌లో భాగంగా రూ.36 లక్షల రుణాలతో 16 గదులను నిర్మించినట్లు ఆ సంఘం సీఈఓ రవికుమార్‌రెడ్డి తెలిపారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి


ఈ తాండ్రపాడులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు (న్యూటౌన్): యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ సూచించారు. ఆదివారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడులో నీలకంఠేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం క్రికెట్ పోటీలను రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై కొనసాగుతున్న ఆడిట్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 23 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్ చేపట్టామని డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ చెన్నకేశవ స్పష్టం చేశారు. ఆదివారం కర్నూలు మండలం ఆర్‌కే దుద్యాల, పూడూరు, పసుపల, దిన్నెదేవరపాడు, రుద్రవరం గ్రామాల్లో 18 సోషల్ ఆడిట్ బృందాల సభ్యులు ఉపాధి పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–2023 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం నిధులతో మండల పరిధిలో జరిగిన పనులకు సంబంధించి రికార్డులను పరిశీలించామని, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తామని చెప్పారు. ఆడిట్ వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని అన్నారు.

నవ్వితే హృదయం పదిలం


మిమిక్రీ ఆర్టిస్ట్ రమేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): మనసారా నవ్వితే హృదయం ఆరోగ్యంగా ఉంటుందని కార్డియాలజిస్టు, కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను డాక్టర్ పి.చంద్రశేఖర్ వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 60 వేల లాఫింగ్ క్లబ్‌లు ఉన్నాయని, దీన్ని బట్టి నవ్వుకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందన్నారు. మనసారా నవ్వితే మెదడులో ఎండార్ఫిన్‌లు విడుదలై హృదయానికి మేలు చేస్తాయని, వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, మానసిక ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన తగ్గుతాయని, పలు రకాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. చిరునవ్వుతో మానవ సంబంధాలు, కమ్యూనికేషన్స్ పెరుగుతాయని, మనిషి జీవితకాలం పెరుగుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి దైనందిత జీవితంలో నవ్వును ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ జె.రమేష్ చేసిన మిమిక్రీ విశేషంగా అలరించింది. అనంతరం ఆయన్ను డాక్టర్ చంద్రశేఖర్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు కల్కూర చంద్రశేఖర్, చంద్రశేఖర్, ఎలమర్తి రమణయ్య, పాపారావు, వాసు, లక్ష్మణ్ సన్మానించారు.

12న మండల మీట్

కోడుమూరు రూరల్: కోడుమూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీన ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని, మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

విజయం 'పది'లం

- పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 98.70 శాతం ఉత్తీర్ణతతో గోరంట్ల గురుకులం సత్తా


రాజేష్ - 571 కోడుమూరు మోడల్ స్కూల్ | శరణ్య - 559 కోడుమూరు మోడల్ స్కూల్ | వంశీకృష్ణ -541 సి.బెళగల్ గురుకులం


ఉసేన్ - 536 సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ | సఫీనాబేగం-534 సి.బెళగల్ జెడ్పీహైస్కూల్ | మైకేల్ - 534, సి.బెళగల్ మోడల్ స్కూల్

కోడుమూరు రూరల్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం వెలువడిన పదో ఫలితాల్లో ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్థాయికి ధీటుగా అత్యధిక మార్కులు సాధించారు. కోడుమూరు బాలికల హైస్కూల్ విద్యార్థిని కిరణ్‌మై అత్యధికంగా 579 మార్కులు సాధించగా, ధరణి 540 మార్కులు సాధించారు. అలాగే మోడల్ స్కూల్‌కు చెందిన తలారి రాజేష్ 571 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలవగా, శరణ్య 559, గోవర్ధన్ 548 మార్కులు సాధించారు. ప్యాలకుర్తి హైస్కూల్‌కు చెందిన నస్రీన్ 517, అమడగుంట్ల హైస్కూల్‌కు చెందిన మహేంద్ర 514 , లద్దగిరి హైస్కూల్‌కు చెందిన రామ్ దినేష్ 504 మార్కులు సాధించి సత్తా చాటారు.

టాప్ లేపిన గోరంట్ల గురుకులం

మండలంలోని గోరంట్ల ఎంజేపీఏపీడబ్ల్యూ బాలుర పాఠశాలకు చెందిన 77 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 76 మంది ఉత్తీర్ణులయ్యారు. 98.70 శాతం ఉత్తీర్ణతతో మండలంలో టాపర్‌గా నిలిచారు. విద్యార్థులు గణేష్ – 586 మార్కులు, మనోహర్ 584, ఎల్లా మనోహర్‌రెడ్డి 582, సాయి దినేష్ 572, విష్ణువర్ధన్ 572 మార్కులు సాధించి సత్తా చాటారు.

సత్తా చాటిన టైలర్ కుమార్తె

కోడుమూరు రూరల్: కోడుమూరు హైస్కూల్ చెందిన విద్యార్థిని కిరణ్‌మై పదో తరగతిలో 579 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచారు. కోడుమూరుకు చెందిన మోహన్‌కుమార్, స్వప్న దంపతులు టైలర్ పని చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. పెద్ద కుమార్తె కిరణ్‌మై స్థానిక బాలికల హైస్కూల్లో పదో తరగతి చదివింది. తల్లిదండ్రుల కష్టాన్ని దగ్గరుంచి చూసిన కిరణ్‌మై పట్టుదలతో చదివి శనివారం వెలువడిన పది ఫలితాల్లో 579 మార్కులతో సత్తా చాటింది. దీంతో తల్లిదండ్రులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. అధిక మార్కులు సాధించిన కిరణ్‌మైని ఎంఈఓ అనంతయ్య, హెచ్‌ఎం నాగరాజకుమారి అభినందించారు.

సి.బెళగల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో గ్రామీణ విద్యార్థులు ఉత్తమ మార్కులతో మెరవడంతో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న 13 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారు. సి.బెళగల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి 64 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51 మంది పాసవ్వడంతో 80 శాతం ఉత్తీర్ణతతో మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. 64 శాతం ఉత్తీర్ణతతో సి.బెళగల్ కస్తూర్బా బాలికల విద్యాలయం, 61.33 శాతం ఉత్తీర్ణతతో సి.బెళగల్ మోడల్ స్కూల్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.


579 మార్కులు సాధించిన కిరణ్‌మైకి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

సి.బెళగల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన వంశీకృష్ణ 541, స్థానిక బీసీ హాస్టల్లో ఉంటూ జెడ్పీ హైస్కూల్‌లో చదివిన దూదేకుల ఉసేని- 536, జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సఫీనా బేగం 534, స్టీఫెన్ మైకేల్ 534 మార్కులతో టాపర్లుగా నిలిచారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు(న్యూటౌన్): విద్యార్థులు బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం ఉల్చాల గ్రామంలోని ఎంపీపీ నివాసంలో.. పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన సయ్యద్ చాందిని (540 మార్కులు)ని ఎంపీపీతో పాటు మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, సర్పంచు విద్యాసాగర్, స్కూల్ కమిటీ చైర్మన్ అలీ షేర్ తదితరులు మిఠాయి తినిపించి ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అన్ని హంగులతో తీర్చిదిద్దారని అన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి డిజిటల్ విద్యా బోధన అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంచలింగాల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు మండలం పంచలింగాల జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం మనోరంజని తెలిపారు. పాఠశాలలో 14 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసి అందరూ పాసైనట్లు చెప్పారు. విద్యార్థి సందెపోగు అక్షయ 504 మార్కులతో సత్తా చాటారని వెల్లడించారు.


విద్యార్థిని చాందినిని అభినందిస్తున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

మెరిసిన ఆణిముత్యాలు

పాణ్యం: పదో తరగతి ఫలితాల్లో రెసిడెన్షియల్ విద్యార్థులు సత్తాచాటారు. నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధించి గత రికార్డులను బద్దలు కొట్టింది. ఈ పాఠశాలలో ఏకంగా 93.51 శాతం ఉత్తీర్ణత నమోదైంది. విద్యార్థిని ఎల్. గీతా మల్లిక 575 మార్కులతో టాపర్‌గా నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన కె.వైష్ణవి 573 మార్కులు సాధించారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌లో 87 మందికిగాను 57 మంది (58.62 శాతం) ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని సి.కె వర్ష 569 మార్కులతో సత్తా చాటారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో 60.53 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాలలో 38 మందికి గాను 23 మంది పాసయ్యారు. పాణ్యం చెంచుకాలనీలోని గిరిజన గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలో 81.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాలలో 37 మందికి గాను 30 మంది ఉత్తీర్ణత సాధించారు. గిరిజన గురకుల బాలికల పాఠశాలలో 72.41 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఓర్వకల్లు: మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గిపోయింది. మొత్తం 13 ప్రభుత్వ పాఠశాలల నుంచి 763 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 371 మంది పాసై (48 శాతం ఉతీర్ణత) సాధించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 392 మంది ఫెయిలయ్యారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో 83 మందికి అందరూ ఉత్తీర్ణత సాధించగా విద్యార్థులు భానుప్రకాష్, లాల్ మహ్మద్ – 580 మార్కులు, వీరేష్‌నాయక్–578 మార్కులతో టాపర్లుగా నిలిచారు. కస్తూర్బా విద్యాలయంలో 36 మంది విద్యార్థినులకు 24 మంది (66 శాతం), సోమయాజులపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 40 మందికి గాను 24 మంది (60 శాతం), ఏపీ మోడల్ స్కూల్‌లో 95 మందికిగాను 55 మంది (58 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పూడిచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో 20 మందికి కేవలం ఇద్దరు పాసయ్యారు. ఉయ్యాలవాడ జెడ్పీ హైస్కూల్‌లో 66 మందికి 30 మంది (45 శాతం), లొద్దిపల్లె ప్రభుత్వ పాఠశాలలో 47 మందికి 19 మంది (45 శాతం), హుసేనాపురం జెడ్పీ హైస్కూల్‌లో 52 మందికి 17 మంది, శకునాల జెడ్పీ హైస్కూల్‌లో 42 మందికి 8 మంది, కన్నమడకల జెడ్పీ హైస్కూ ల్‌లో 18 మందికి 5 మంది, మీదివేముల జెడ్పీ హైస్కూల్‌లో 63 మందికి 32 మంది, నన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో 112 మందికి 52 మంది, ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్‌లో 89 మందికి 21 మంది ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు.

గడివేముల: మండలంలో 387 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా 184 మంది ఉత్తీర్ణత సాధించారు. గని జెడ్పీ పాఠశాల విద్యార్థిని మర్రిమాను షేక్ సానియా 532 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని 508 మార్కులు సాధించి రెండవస్థానంలో నిలిచింది. కస్తూర్బా పాఠశాల విద్యార్థి మహిమలత 505 మార్కులు సాధించింది. గడివేముల జెడ్పీ స్కూల్ విద్యార్థి గువ్వల శ్రావణి 501 మార్కులు సాధించింది. పదిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పలువురు అభినందనలు చెబుతున్నారు.

కల్లూరు: శనివారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మండలంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 18 పాఠశాలల నుంచి 1,238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 561 మంది (45 శాతం) ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. అత్యధికంగా ఏపీఆర్ ఈఐఎస్ (మైనార్టీ) పాఠశాల 95 శాతం, అతి తక్కువగా బొల్లవరం పాఠశాల 9 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వెల్లడించారు. ఉలిందకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన యూ.అలేఖ్య – 571, పెద్దపాడు ఏపీ మోడల్ పాఠశాల నుంచి కె.గిరిబాబు – 563, ఏపీఆర్‌ఈఐఎస్ (మైనార్టీ) పాఠశాల విద్యార్థిని ఎస్.రాణి – 576 మార్కులతో టాపర్లుగా నిలిచారు.


గడివేముల మండల టాపర్‌గా నిలిచిన గని జెడ్పీహైస్కూల్ విద్యార్థిని సానియా (532 మార్కులు)కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు


గీతామల్లిక - 575 నెరవాడ బీసీ బాలికల గురుకులం | కె.వైష్ణవి - 573 నెరవాడ బీసీ బాలికల గురుకులం | సి.కె.వర్ష - 569 నెరవాడ బీసీ బాలికల గురుకులం


మహ్మద్ - 580 కాల్వబుగ్గ గురుకులం | భానుప్రకాష్ -580 కాల్వబుగ్గ గురుకులం | అలేఖ్య- 571 ఉలిందకొండ జెడ్పీ హైస్కూల్


కె.గిరిబాబు - 563 పెద్దపాడు మోడల్ స్కూల్ | ఎస్.రాణి-576, ఆర్ఈఐఎస్ (మైనార్టీ) స్కూల్

ఉనికి కోసమే టీడీపీ తప్పుడు ఆరోపణలు


వాస్తవాలు వివరిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

- అక్రమాలు నిరూపిస్తే ఆస్తులను మీకే రాసిస్తా
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: నారా లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర అట్టర్‌ఫ్లాప్ అయ్యిందనే ఫ్రస్ట్రేషన్‌లో టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ డ్రామాలన్నీ తమకు తెలుసునని, ప్రజల దృష్టి మరల్చేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కొండారెడ్డి బురుజు సాక్షిగా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నా, ఆరోపణలు చేసిన వారు వచ్చి రుజువు చేస్తే శాశ్వతంగా రాజకీయాలతో పాటు, కర్నూలును వదిలి వెళ్తానని సవాల్ విసిరారు. నగరంలోని పార్కులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్న తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ముజఫర్ నగర్‌లో వక్ఫ్ బోర్డు స్థలం 10.64 ఎకరాల్లో 7 ఎకరాలను అప్పటి టీడీపీ నాయకులు వెంచర్‌వేసి అమ్ముకున్నారని, 2019 ఎన్నికల సమయంలో స్థలం అన్యాక్రాంతం కాకుండా న్యాయం చేయాలని మైనార్టీ నాయకులు కోరడంతో రెండేళ్లు పోరాటం చేసి వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడి కాంపౌండ్ వాల్ నిర్మించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం అక్కడ జిల్లాలోనే అతి పెద్ద మసీదు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. కాల్వబుగ్గ దేవాలయంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎస్‌ఐపై తిరగబడితే కేసు నమోదు చేశారని, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రెండెకరాల స్థలం జెడ్పీ మాజీ చైర్మన్‌ది కాదా అన్ని ప్రశ్నించారు. 2014–2019 మధ్య అసైన్‌మెంట్ కమిటీ లేదని, 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేని వాటిని ఆన్‌లైన్ నుంచి తొలగించామని, అంతేగానీ ఎవరి స్థలాలను కబ్జా చేయలేదని స్పష్టం చేశారు. ఎస్‌ఆర్‌బీసీ కాల్వకు సంబంధించి నిజమైన రైతులకు న్యాయం జరిగేలా చేశామన్నారు. నమ్మిన పార్టీకి మోసం చేసే గుణం తమ కుటుంబంలో లేదన్నారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, చిట్టెమ్మ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేష ఫణి ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు (న్యూటౌన్): 'స్పందన ' కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్.శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంలో మండల పరిధిలోని 12 రెవెన్యూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వచ్చే వినతి పత్రాలను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు 'స్పందన' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'స్పందన'ను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

సి.బెళగల్: సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. ఆయన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంటూ.. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి పంపించడంతో పాటు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు.స్పందన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు సోనియాగాంధీ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలోని 39వ వార్డు సోనియాగాంధీ నగర్‌లో ఈ నెల 8వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

లోకేష్, చంద్రబాబు యాత్రలు వృథా


మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): రాజకీయ మనుగడ కోసం టీడీపీ నేతలు నారా లోకేష్, చంద్రబాబునాయుడు చేసే యాత్రలు వృథా అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన ఆదివారం సీ.క్యాంప్‌లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలను మరోసారి నమ్మించేందుకు తండ్రీ కొడుకులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు కంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు వంద రెట్లు మేలు చేశారని చెప్పారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకోవడం లేదని, గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మంచి పనులే మళ్లీ జగనన్నను సీఎం చేస్తాయన్నారు. ఎవరెన్ని ఎత్తులు, కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం పదవులు ఇచ్చి సమాజంలో గౌరవం, సామాజికంగా, రాజకీయంగా గుర్తింపు కల్పించారని కొనియాడారు. ప్రజల్లో జగనన్న ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, ఎలాగూ గెలవలేమని టీడీపీ నాయకులు విషం చిమ్మేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ పరిజ్ఞానం లేని లోకేష్ పాదయాత్రలో ఏ నియోజకవర్గానికి వెళితే ఆ ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇలాంటివి మానుకోవాలని హితవుపలికారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకుండా మోసం చేసిన ద్రోహి అని ఆరోపించారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి


మాట్లాడుతున్న ఉద్యాన అధికారి మదన్‌మోహన్ గౌడ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్ల తోటల సాగు చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ కోడుమూరు డివిజన్ అధికారి మదన్‌మోహన్‌గౌడు సూచించారు. ఆయన ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లోమా కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. టమాట, బెండ, మిరప, ఉల్లి తదితర పంటల సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. మిరప పంటలో నారుమడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కూరగాయల పంటల్లో తెగుళ్లు, పురుగుల యాజమాన్యం గురించి సూచనలు ఇచ్చారు. కూరగాయలు, పండ్లతోటల్లో సాధ్యమైనంత వరకు కెమికల్స్ వాడకాన్ని తగ్గించాలని, పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు వినియోగించాలని కోరారు. ఉద్యాన పంటల్లో అధికోత్పత్తి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వివిధ చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, విత్తనశుద్ధి అత్యవసరమని, మొక్కల మధ్య తగిన దూరం పాటించాలని సూచించారు. తరచూ ఒకే పంట వేయరాదని, పంట మార్పిడి చేయాలన్నారు. రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

ఫెయిలైన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పాణ్యం: రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో బాలబాలికలు సత్తాచాటారు. కొన్ని పాఠశాలలో ఆశించిన మేర ఫలితాలు దక్కలేదు. నంద్యాల జిల్లాలోని తమ్మరాజుపల్లె హైస్కూల్‌లో 11 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేదు. దీనిపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆరా తీశారు. పాఠశాల నుంచి ఒక్కరు కూడా పాస్ కాకపోవడంపై డీఈఓ ద్వారా వివరాలు తీసుకున్నట్లు సమాచారం. అలాగే విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా బోధన తదితర అంశాలపై ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల సూచనలతో హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది నష్టనివారణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పాఠశాలలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

విద్యార్థులకు రేమిడియల్ తరగతులు

తమ్మరాజుపల్లె హైస్కూల్‌లో 11 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వీరిలో 9 మంది గణితం, ఐదుగురు తెలుగు, ఒకరు హిందీ, నలుగురు సైన్స్, సోషల్‌లో ఒకరు చొప్పున ఫెయిలయ్యారు. ఇంగ్లిష్‌లో అందరూ పాసయ్యారు. వీరికి వచ్చే నెలలో సప్లమెంటరీ పరీక్షలు ఉండడంతో అందుకు తగ్గట్టు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా తరగతులు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరగతులు ఉంటాయి. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే తరగతులు బోధిస్తారు. ఇలా ఈ నెల చివరి వరకు రెమిడియల్ తరగుతులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే విద్యార్థులకు సమాచారం అందడంతో నేటి నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

తమ్మరాజుపల్లె హైస్కూల్‌లో ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించకపోవడానికి కారణమైన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే సబ్జెక్టులు బోధించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రాజునాయుడు, శివక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నాం. ఉత్తీర్ణతపై ఆరా తీశాం. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టనున్నాం. పాఠశాల సిబ్బందికి తరగతులపై సూచనలు చేశాం. సప్లిమెంటరీ పరీక్షలు మొదలయ్యే వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తాం.
– మహబూబ్ బేగ్, డిప్యూటీ డీఈఓ

గడప గడపకూ సంక్షేమ లబ్ధి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి తడకనపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నామన్నారు. పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు కోరగా మెయింటెనెన్స్ సక్రమంగా చేసుకుంటే తప్పకుండా కట్టిస్తామన్నారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, తహసీల్దార్ రమేష్‌బాబు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలే మంచి నేస్తాలు

గడివేముల: విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను మంచి నేస్తాలుగా చూసుకోవాలని గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఆయన ఆదివారం గడివేముల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాయాలాధికారి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మేధోశక్తి పెరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ వేసవిలో సమయం వృథా చేయకుండా గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం ఉంటుందని చెప్పారు.